# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పంచాయతీరాజ్, అటవీ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.**

2. **వన్యప్రాణుల సంరక్షణ కోసం చేపట్టిన హనుమాన్ ప్రాజెక్టును మంగళగిరిలో ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.**

3. **భూగర్భ జలాల పెరుగుదలలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్న జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.**

4. **ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు సమావేశమమైయ్యారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, తదితర అంశాలపై చర్చించారు. వీటితో పాటు అటవీ శాఖ చేపట్టిన హనుమాన్ ప్రాజెక్ట్ వివరాలను ముఖ్యమంత్రికి పవన్ కళ్యాణ్ తెలియజేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల పనుల గురించి తెలియజేస్తూ, పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్స్ నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణ సమర్ధవంతంగా అమలు చేయవచ్చని పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడుకు వివరించారు .

-------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా కళ్యాణ మహోత్సవాన్ని ఈ తెల్లవారుజామున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి ప్రత్యేక ఆశీర్వచనాలు పొందారు.

-------------------------

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న వన్యప్రాణులను సంరక్షించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ప్రతియేటా మార్చి 3వ తేదీన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. మానవ జాతి మనుగడకు అంతరించి పోతున్న ఎన్నోరకాల వన్యప్రాణులను, వృక్షాలను పరిరక్షించుకోవాలని అవగాహన కల్పిస్తూ ఈరోజు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

-------------------------

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ కోసం చేపట్టిన హీలింగ్ అండ్ నుర్ట్యూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ & నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్ – హ.ను.మా.న్ ప్రాజెక్టును గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్ పేరేడ్ గ్రౌండ్స్ ప్రాంగణంలో ఉపముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ – వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని పొడిగిస్తున్నట్లు సెట్ కన్వీనర్ ఎన్.మోహన్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆలస్య రుసుము లేకుండా మార్చి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో మార్చి 21 వరకు, 2వేలతో మార్చి 25 వరకు, 4వేలతో మార్చి 30, 10వేల రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ 3 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించామని చెప్పారు. పరీక్షల నిర్వహణ తేదీల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి 15 వరకు నిర్వహిస్తామని, వ్యవసాయ, ఫార్మసీ పరీక్షలు మే 19, 20 తేదీల్లో ఉంటాయని తెలిపారు

-------------------------

భూగర్భ జలాల పెరుగుదలలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మదనపల్లిలో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, అన్నమయ్య జిల్లాలో ఉద్యానవన పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

-------------------------

ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అమృత కృష్ణ -- స్వచ్ఛ కృష్ణ కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఈ ప్లాంట్ ద్వారా సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.స్వచ్ఛత, ఆరోగ్యం, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

చంద్రగ్రహణం నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసి వేశారు. శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం సహా పలు పుణ్యక్షేత్రాలను మూసివేశారు. చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మూసివేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరి తెలిపారు..సాయంత్రం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమం నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలియజేస్తూ,

వాయిస్..20 సెకన్లు

---------------------------

చెవుల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ శ్రవణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రతి ఏటా మార్చి మూడవ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. అధిక శబ్దం, జన్యుపరమైన కారణాలు, చెవిలోకి నీరు చేరడం లేదా వయో భారం వంటి కారణాల వల్ల వినికిడి లోపం ఏర్పడే అవకాశం ఉంది. తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వినికిడి లోపం ఏర్పడకుండా చూసుకోవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. “వినికిడి సంరక్షణ అందరికీ అందుబాటులో ఉండాలి” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ శ్రవణ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణన ప్రక్రియను జిల్లాలో ఎటువంటి లోపాలు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ అన్నారు. జన గణన మొదటి దశలో భాగంగా చేపట్టే ‘గృహాల జాబితా, గృహ వసతుల గణన’ పై జిల్లా స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని విజయనగరంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ.., ఈ రోజు నుంచి ఈ నెల 5వ తేదీ వరకు జరిగే మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలలో జనగణన సమాచార సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది బాధ్యతయుతంగా పని చేసి విజయనగరం జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

---------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా సౌకర్యం అందుబాటులో ఉందని విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ధరల్లోనే కార్గో రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే ప్రత్యేక కార్గో విమానాలను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

====================